సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం ; 27 ; సెప్టెంబర్ ; 2024



చెరువు సుందరీకరణకు కృషి
జీబీనగర్ చెరువును సుందరీకరించి మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. - 9లో



పరిశుభ్రత అందరి బాధ్యత
'స్వచ్ఛత హీ సేవ'లో భాగంగా విద్యార్థులకు ఆటలపోటీలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. - 9లో



ఆర్థిక స్వావలంబన సాధించాలి
మహిళారైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలని నాబార్డ్ డీడీఎం ఎం.వినయ్ కుమార్ సూచించారు. - 9లో

న్యూస్‌రీల్

యాదాద్రి ఆలయ సూపరింటెండెంట్‌గా శ్రీలత

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం సూపరింటెండెంట్‌గా వేములవాడ శ్రీరాజరాజేశ్వరి ఆలయ సూపరింటెండెంట్ శ్రీలత డిప్యూటేషన్‌పై రానున్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవాదాయ శాఖలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా గత నెల 6న యాదాద్రినుంచి 26 మంది వేములవాడ, కొమురవెల్లి, బాసర, భద్రాచలం ఆలయాలకు బదిలీ అయ్యారు. ఇందులో వేములవాడకు వెళ్లిన సూపరింటెండెంట్ రాజన్‌బాబు ఇప్పటికే డిప్యూటేషన్‌పై యాదాద్రికి వచ్చారు. రాజన్‌బాబు స్థానంలో వేములవాడ నుంచి యాదాద్రికి వచ్చిన సూపరింటెండెంట్ శ్రీనివాస్ తిరిగి పూర్వస్థానానికి వెళ్లిపోయారు. యాదాద్రినుంచి వేములవాడకు బదిలీపై వెళ్లిన మరో సూపరింటెండెంట్ శ్రీలత తిరిగి యాదాద్రి క్షేత్రానికి రానున్నారు. ఈ విషయమై యాదాద్రి దేవస్థానం ఈఓ భాస్కర్ రావును వివరణ కోరగా.. ఇక్కడినుంచి 26 మంది బదిలీకాగా 24 మంది మాత్రమే వచ్చారని తెలిపారు. వేములవాడ నుంచి శ్రీలత డిప్యూటేషన్‌పై యాదాద్రికి వస్తున్నారని, ఇంకా ఒక సూపరింటెండెంట్ పోస్టు భర్తీ చేయాల్సి ఉందన్నారు.

నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

భువనగిరి టౌన్ : తెలంగాణ పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10:45 గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఒక ప్రకటనలో తెలిపారు. ఆహ్వానితులు, అధికారులు, ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

సబ్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన జడ్జి



భువనగిరిలోని సబ్‌జైలును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

భువనగిరి క్రైం : భువనగిరిలోని సబ్ జైలును గురువారం జిల్లా ప్రధాన జడ్జి జయరాజు సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు, జైలులో కల్పిస్తున్న సౌకర్యాలపై తెలుసుకున్నారు. న్యాయవాదులను నియమించుకునే స్థోమత, సహకారం లేని ఖైదీలు న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం న్యాయ సహాయ శిబిరాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, జైలు సూపరింటెండెంట్ ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన జడ్జి జయరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీపడదగిన కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. కేసులు అధిక మొత్తంలో పరిష్కారం అయ్యేలా న్యాయవాదులు, పోలీసు అధికారులు కృషి చేయాలని కోరారు.

ఉత్పత్తుల మేళాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

ఆత్మకూరు(ఎం) : హైదరాబాద్‌లో ఈ నెల 27నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి మహిళా ఉత్పత్తుల మేళాను విజయవంతం చేయాలని వ్యవసాయేతర ఉత్పత్తుల జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రమణ పేర్కొన్నారు. గురువారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని స్త్రీనిధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేళా వివరాలను ఆయన వెల్లడించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను మేళాలో ప్రదర్శిస్తారని తెలిపారు. మేళాలో యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి 11 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలన్న సంకల్పంతో ప్రభుత్వం వారికి అనేక విధాలా ప్రోత్సాహం అందజేస్తుందన్నారు. అందులో భాగంగానే మేళా నిర్వహిస్తుందన్నారు. నెక్లెస్ రోడ్డులో పీపుల్స్ ప్లాజాలో మేళా నిర్వహిస్తారని, మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీఓలు పక్కీరయ్య, వెంకన్న,కంప్యూటర్ ఆపరేటర్ చంద్రస్వామి పాల్గొన్నారు.

పరికరాలున్నా పనిచేయవు!

ప్రభుత్వ ఆస్పత్రులకు పోటెత్తుతున్న జ్వర పీడితులు.. సీబీపీ టెస్ట్‌లు చేయక అవస్థలు

- భువనగిరిలోని తెలంగాణ డయోగ్నోస్టిక్ సెంటర్‌కు రక్త నమూనాలు
- ఆలస్యమవుతున్న రిపోర్టులు
- ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తూ రూ.వేలల్లో ఖర్చు చేస్తున్న రోగులు

చౌటుప్పల్ మండల పరిధిలో ఓ మహిళ జ్వరంతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేరింది. వెంటనే రక్త పరీక్షలు చేయాల్సి ఉంది. కానీ, ఆస్పత్రిలో పరికరాలు లేకపోవడంతో భువనగిరిలోని తెలంగాణ దయాగ్నోస్టిక్ సెంటర్‌కు రక్తనమూనాలు పంపించారు. డెంగీ రక్త పరీక్షలు కూడా నిర్వహించడం లేదు. డెంగీ కిట్లు నాణ్యతగా లేకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. దీంతో బాధితుల రక్తనమూనాలను భువనగిరికి పంపుతున్నారు. మరోవైపు ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లకు గాను ఒకరు సెలవులో ఉండదంతో ప్రస్తుతం ఒక్కరితోనే నడిపిస్తున్నారు. పరీక్షలు అత్యవసరం ఉన్న రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. టెస్ట్ రకాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.



రోగులతో కిక్కిరిసిన భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి

సాక్షి,యాదాద్రి : జ్వర పీడితులకు రక్త పరీక్షలు తప్పనిసరి. సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) టెస్ట్‌చేస్తేనే నాణ్యమైన వైద్యం అందించడానికి వీలుంటుంది. కానీ, జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కడా సీబీపీ టెస్ట్‌లు చేయడం లేదు. రూ.లక్షలు వెచ్చించి పరికరాలు కొనుగోలు చేసినా వాటిని వినియోగించే పరిస్థితి లేదు. కొన్ని చోట్ల పనిచేయకపోగా, మరికొన్ని చోట్ల టెక్నీషియన్ల కొరతతో నిరుపయోగంగా మారాయి. చేసేది లేక రక్త నమూనాలను భువనగిరిలోని తెలంగాణ దయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపుతున్నారు. అక్కడా ఫలితం ఆలస్యమవుతుండడంతో రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.

పరీక్షలు చేయకుండానే వైద్యం
జ్వర పీడితులకు సీబీపీ టెస్ట్ చేసిన తర్వాతనే వైద్యం అందించాలి. కానీ, చాలా చోట్ల అలా జరుగడం లేదు. జిల్లాలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా దాదాపు అన్ని చోట్ల సీబీపీ టెస్టింగ్ మిషన్లు ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కో మిషన్‌ను రూ. 3.50 లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసింది. సీబీపీ టెస్టు చేయకపోవడం వల్ల వైరల్ ఇన్‌ఫెక్షనా, లేదా బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షనా నిర్ధారణ కావడం లేదు. ఫలితంగా జ్వరంతో ఆస్పత్రులకు వస్తున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

అంతటా నిరుపయోగంగానే సీబీపీ మిషన్లు
జిల్లాలోని ఏ ఆస్పత్రిలో కూడా సీబీపీ యంత్రాలు వినియోగంలో లేవు. కొన్ని చోట్ల పనిచేస్తున్నా టెక్నీషియన్లు అందుబాటులో ఉండకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మరికొన్ని ఆస్పత్రుల్లో పనిచేయడం లేదు. వీటిని వినియోగంలోకి తేవాల్సి ఉన్నా వైద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోజూ కనీసం 10 నుంచి 15 శాంపిల్స్ తీయాలి. అలా తీయకపోతే అవి పనిచేయకుండా పోతాయి. కానీ, వివిధ కారణాల వల్ల ఆ విధంగా జరగడం లేదు. జిల్లాలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వాటిలో 34 మంది టెక్నీషియన్లు ఉన్నారు. ఇందులో 11 మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్‌లో పని చేస్తున్నారు.

ప్రభుత్వ వేతనం తీసుకుంటూ.. ప్రైవేట్ ల్యాబ్‌లు
ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నా ల్యాబ్‌టెక్నీషియన్లు విధులపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం వేతనం తీసుకుంటూ ప్రైవేట్‌గా డయాగ్నోస్టిక్ సెంటర్లు నడుపుతున్నారని, ఆస్పత్రులకు వచ్చిన జ్వరపీడితులకు సీబీపీ టెస్టులు చేయకుండా ఉండేందుకు ఉద్దేశపూర్వకంగానే యంత్రాలను మూలనపడేశారన్న ఆరోపణలున్నాయి. అత్యవసర వైద్యపరీక్షలు ప్రైవేట్‌లోనే చేయించుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కొందరు టెక్నీషియన్లు కమీషన్లు తీసుకుంటూ ప్రైవేట్ దయాగ్నోస్టిక్ సెంటర్లకు రిఫర్ చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్ పలు ఆస్పత్రులను తనిఖీ చేసిన సమయంలోనూ ల్యాబ్‌టెక్నీషియన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపడాలని హెచ్చరించారు.

ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆరు నెలల నుంచి సీబీపీ యంత్రం పనిచేయడం లేదు. దీంతో జ్వరపీడితుల రక్తనమూనాలను భువనగిరిలోని తెలంగాణ దయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపుతున్నారు. పరీక్షలు చేసిన తర్వాత సదరు రోగి సెల్‌ఫోన్‌కు టెస్ట్ రిపోర్టు వస్తుంది. రిపోర్టు రావడానికి రెండు రోజుల సమయం పడుతోంది. జాప్యం జరుగుతుండడంతో కొందరు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.





చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జిల్లా అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరిటౌన్ : వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కలెక్టర్ హనుమంత్ కే.జెండగే పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తికోసం వీరోచిత పోరాటం చేసిన ధైర్యశాలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి
సాక్షి,యాదాద్రి : రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీలో వున్న శాఖలు సమన్వయంతో పని చేయాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడడం , ప్రమాదాలు జరగానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలు, మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలు ఉన్న చోట ప్రత్యేక భద్రతా చర్యలుండాలని ఆదేశించారు. ఎయిమ్స్ వద్ద అండర్‌పాస్ కోసం డీపీఆర్ సిద్ధం చేయాలని, కొండమడుగు దగ్గర అండర్‌పాస్ పనులను నెల రోజుల్లో ప్రారంభించాలని, సింగన్నగూడెం అండర్ పాస్‌కు టెండర్లు పిలవాలని పేర్కొన్నారు. సమావేశంలో రోడ్లు భవనాలు, పోలీసు, పంచాయతీరాజ్, జాతీయ రహదారి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ
భువనగిరి టౌన్ : వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వయోవృద్ధుల రక్షణ, వారి హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

15 ఏళ్ల నిరీక్షణకు తెర

- సెకండరీ గ్రేడ్ టీచర్లుగా డీఎస్సీ-2008 అభ్యర్థులు
- కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 391 మంది అభ్యర్థులకు లబ్ధి
- నేటినుంచి నల్లగొండలో సర్టిఫికెట్ల పరిశీలన



భువనగిరి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీఎస్సీ-2008లో నష్టపోయిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ)గా నియమించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 391మంది అభ్యర్థులు ప్రయోజనం పొందనున్నారు. నల్లగొండలోని డీఈఓ కార్యాలయంలో శుక్రవారం నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగనుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు..
2008 డిసెంబర్ 6వ తేదీన నాటి ప్రభుత్వం 35వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో 30 శాతం ఎస్జీటీ పోస్టులను డీఈడీ చేసిన వారికి ప్రత్యేకంగా కేటాయించారు. దీంతో బీఈడీ అభ్యర్థులు మార్కులపరంగా ముందునప్పటికీ నష్టపోయారు. అప్పటి నుంచి తమకు ఉద్యోగాలు ఇవ్వాలని పోరాటాలు చేస్తూ కోర్టులను సైతం ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టులు తీర్పును సైతం ఇచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అభ్యర్థులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వీరికి వేతనం కింద నెలకు రూ.31,030 చెల్లించనున్నారు.

ఎంపిక ఇలా..
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 391 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో 100 నుంచి 115 మంది ఇతర ఉద్యోగాల్లో చేరారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న సర్టిఫికెట్‌ల పరిశీలనకు 250 నుంచి 260 మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ పత్రాన్ని విద్యాశాఖ అందుబాటులో ఉంచింది. దానిని పూర్తిగా నింపి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేసేందుకు అంగీకరిస్తున్నట్లు సంతకం చేయాల్సి ఉంటుంది. అంగీకార పత్రాన్ని సర్టిఫికెట్‌ల పరిశీలన సమయంలో అధికారులకు అందజేయాలి.

సమయానికి హాజరుకావాలి
నల్లగొండ డీఈఓ కార్యాలయంలో శుక్రవారం నుంచి సర్టిఫికెట్‌ల పరిశీలన జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం .అభ్యర్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో సకాలంలో హాజరుకావాలి.
–భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

అదనపు కలెక్టర్ కాళ్లపై పడిన రైతు

- ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించాలంటూ వేడుకోలు

గుండాల : ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించాలంటూ ఓ రైతు అదనపు కలెక్టర్ కాళ్లపై పడి వేడుకున్నాడు. గుండాల మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుండాలకు చెందిన గోపాల్‌దాస్ అయిలయ్య ఎకరంన్నర వరి సాగు చేశాడు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తన వ్యవసాయ మోటార్‌కు కనెక్షన్ తీసుకున్నాడు. కాగా ట్రాన్స్‌ఫార్మర్‌పై కనెక్షన్లు ఎక్కువగా ఉండడంతో లో ఓల్టేజీ సమస్య ఏర్పడుతోంది. మోటారు ఆగిపోయడం, ట్రిప్ అవుతుండడంతో పొలానికి సరిగా నీరందడం లేదు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని పలుమార్లు ఆ శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ కాళ్లపై పడి ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించాలని వేడుకున్నాడు. స్పందించిన అదనపు కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రైతుకు హామీ ఇచ్చారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన
అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను పరిశీలించారు. దేవాదుల కాల్వకోసం రెండుసార్లు భూములు కోల్పోయిన రైతుల సమస్యను వారంలోగా పరిష్కరిస్తానని చెప్పారు. మీ సేవలో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 45 రోజుల్లోపు అందజేయాలని డిప్యూటీ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎస్‌డీసీసీబీలో చార్జ్ క్రియేషన్స్ పేరిట రుణాలు ఇవ్వడం లేదని రైతులు ఫిర్యాదు చేయగా బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్ జలకుమారి, డిప్యూటీ తహసీల్దార్ నీలిమ ఉన్నారు.



గుండాల తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కాళ్లు మొక్కుతున్న రైతు అయిలయ్య

'రీజినల్'పై విచారణ అక్టోబర్ 3కు వాయిదా

సాక్షి, యాదాద్రి : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి నుంచి నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డుపై విచారణ అక్టోబర్ 3కు వాయిదా పడింది. అలైన్‌మెంట్ మార్చాలని రాయగిరి రైతులు హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. గురువారం రైతులు, అధికారుల వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను మరోసారి వాయిదా వేశారు. తీర్పు బాధిత రైతులకు అనుకూలంగా వస్తుందని రైతు సంఘం నాయకుడు తంగెళ్లపల్లి రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

హైకోర్టుకు వర్కట్‌పల్లి, గోకారం రైతులు
వలిగొండ : తమ గ్రామాల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లి, గోకారం రైతులు గురువారం హైకోర్టును ఆశ్రయించారు. మొదటి అలైన్‌మెంట్ మార్చి రెండవ అలైన్‌మెంట్ ప్రకారం భూములు సేకరించడం తగదన్నారు. రెండవ అలైన్‌మెంట్ పరిధిలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారని, వారంతా జీవనోపాధి కోల్పోతారని, న్యాయం చేయాలని కోరారు.

యాదాద్రి లడ్డూలో ఏ నెయ్యి?

- మదర్ డెయిరీ నెయ్యి వినియోగిస్తున్న దేవస్థానం
- విజయ డెయిరీ నెయ్యి వాడాలని ప్రభుత్వ ఆదేశాలు
- సందిగ్ధంలో దేవస్థానం అధికారులు



యాదగిరిగుట్ట : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాదంలో ఏ నెయ్యి వాడాలనే సందిగ్ధంలో దేవస్థానం అధికారులు ఉన్నారు. 2025 మార్చి వరకు మదర్ డెయిరీతో అగ్రిమెంట్ ఉండడంతో ఆ సంస్థ సరఫరా చేసే నెయ్యినే వాడుతున్నారు. అయితే రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో విజయ డెయిరీ నెయ్యిని వినియోగించాలని ప్రభుత్వం ఆదేశాల జారీ చేయడంతో.. ఏ నెయ్యి వాడాతారా.. అనేది ప్రశ్నగా ఉంది.

40 ఏళ్లుగా మదర్ డెయిరీ నుంచే సప్లయ్
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి లడ్డూతో పాటు వివిధ ప్రసాదాల తయారీలో 40 ఏళ్లుగా మదర్ డెయిరీ నెయ్యినే వాడుతున్నారు. రోజూ 700 కిలోల నెయ్యి వినియోగిస్తున్నారు. ఈ ఏడాది కూడా మదర్ డెయిరీ నెయ్యినే వినియోగించేందుకు మార్చికి ముందే టెండర్ ద్వారా దేవస్థానం అగ్రిమెంట్ కుదర్చుకుంది. 2025 మార్చిలో అగ్రిమెంట్ ముగియనుంది. కాగా రాష్ట్రంలోని అన్ని ఆలయాలతో పాటు యాదాద్రి క్షేత్రంలోనూ ప్రసాదాల తయారీకి విజయ డెయిరీ నెయ్యిని వాడాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మదర్ డెయిరీనే వాడాలని యాదాద్రి దేవస్థానం అధికారులకు ఇటీవల సూచించారు. ప్రభుత్వం మరో విధంగా ఆదేశాలు ఇవ్వడంతో దేవస్థానం అధికారులు అయోమయంలో పడ్డారు.

ప్రభుత్వానికి లెటర్ పెడతాం



మదర్ డెయిరీ నెయ్యి కోసం ఇప్పటికే అగ్రిమెంట్ అయ్యింది. అగ్రిమెంట్ 2025 మార్చి వరకు ఉంది. కాబట్టి మదర్ డైయిరీ వాడాలా.. విజయ డైయిరీ వాడాలా స్పష్టత కోసం ప్రభుత్వానికి లెటర్ పెడతాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటాం.
–భాస్కర్‌రావు, యాదాద్రి దేవస్థానం ఈఓ

'గృహజ్యోతి' కొందరికే!

ఆన్‌లైన్‌లో నమోదుకాని దరఖాస్తులు లక్షకు పైనే..
- అర్హతలున్నా జీరో బిల్లుకు దూరం
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- నమోదుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న దరఖాస్తుదారులు



రామన్నపేటలో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకునేందుకు వచ్చిన ప్రజలు



దరఖాస్తులు ఇలా..

మొత్తం	3,75,247
లబ్ధిదారులు	2,40,973
ఆన్‌లైన్ కానివి	1,34,274

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి(జీరో కరెంట్ బిల్) పథకం కొందరి ఇళ్లలోనే వెలుగులు నింపుతోంది. అర్హతలున్నా చాలా పేద కుటుంబాలు పథకానికి నోచుకోవడం లేదు. తెల్లరేషన్ కార్డు నిబంధనతో కొంతమంది, ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేటప్పుడు జరిగిన పొరపాట్లతో మరికొందరు ఈ పథకానికి దూరమవుతున్నారు. దరఖాస్తుదారుల్లో వేలాది మంది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ఎదురుచూస్తున్నారు.

నమోదులో పొరపాట్లు
ఆరు గ్యారంటీల్లో భాగంగా తెల్లరేషన్ కార్డు ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికీ 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు 2023 డిసెంబర్ 28నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులను అధికారులు ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న కంప్యూటర్ల ద్వారా హడావుడిగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ఎంట్రీ చేయించే బాధ్యతలను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం అప్పగించింది. ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీఓలు, తహసీల్దార్లు పర్యవేక్షించారు. అయితే హడావుడిగా ఎంట్రీ చేయడం, సాంకేతిక సమస్య వల్ల ప్రతి మండలంలో 200 నుంచి 300 వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దరఖాస్తులు ఎంట్రీ కానీ కుటుంబాలకు గృహజ్యోతి పథకం వర్తించడం లేదు. అర్హత ఉన్నా ఎప్పటిమాదిరిగానే ఆరు నెలలుగా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

గృహజ్యోతి కాలమ్ నింపినవారికే ఎడిట్ ఆప్షన్
ప్రజాపాలన దరఖాస్తులో ఏ మీటర్ నంబర్ అయితే నమోదు చేశారో అదే నంబర్‌కు జీరో బిల్ వర్తిస్తుంది. అద్దెకు ఉన్నకుటుంబాలు ఇల్లు మారినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటువంటి వారు మీటర్ నంబర్ మార్చుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఇందుకోసం గత నెలలో ప్రజాపాలన వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. అయితే ప్రజాపాలన దరఖాస్తులో గృహజ్యోతి కాలమ్ నింపినవారికి వారికి మాత్రమే ఎడిట్ ఆప్షన్ వర్తిస్తుంది. కొత్తగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంటీ చేయడానికి అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆన్‌లైన్ కాలేదని చెప్పారు



ప్రజాపాలనలో ఉచిత్ విద్యుత్, గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నా. అన్ని అర్హతలు ఉండడంతో రెండు పథకాలు వర్తిసాయని ఆశపడ్డా. తీరా చూస్తే నాకు ఎప్పటిమాదిరిగానే విద్యుత్ బిల్లు వచ్చింది. మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి చెక్ చేయించగా దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించేందుకు చాలాసార్లు కార్యాలయానికి తిరిగా. కొత్తగా దరఖాస్తులు ఎంట్రీ చేయడానికి ఆప్షన్ రాలేదని అధికారులు చెబుతున్నారు.
– పాశం శేఖర్‌రెడ్డి, రామన్నపేట

క్లుప్తంగా

ట్రాక్టర్ పైనుంచి పడి మహిళ దుర్మరణం

వేములపల్లి (మాడ్గులపల్లి): ట్రాక్టర్ పైనుంచి జారి కిందపడి మహిళ మృతిచెందింది. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం పాములపాడు గ్రామ శివారులో గురువారం జరిగింది. పాములపాడు గ్రామానికి చెందిన 20మంది కూలీలు రెండు ట్రాక్టర్లలో సుందర్‌నగర్‌లో గల బంగారు మైసమ్మ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో కల్వలపాలెం పాలేర వాగు వద్దకు రాగానే రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ రావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చొన్న దొంతగాని శైలజ(32) కిందపడిపోయి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. మరో మహిళ శేషగాని నాగమ్మ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఒక పాప, బాబు ఉన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు


హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతసేవ అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

నకిలీ బంగారం అమ్ముతున్న ముఠా అరెస్ట్

- రూ.7లక్షలు, రెండు మోటార్ సైకిళ్లు, ఆటో, 9 సెల్‌ఫోన్లు, 3 నకిలీ బంగారు బిస్కెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి


స్వాధీనం చేసుకున్న నగదు, నకిలీ బంగారం బిస్కెట్లు, సెల్‌ఫోన్లు

హుజూర్‌నగర్: నకిలీ బంగారం అమ్ముతున్న ఐదుగురు ముఠా సభ్యులను హుజూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీఐ కార్యాలయం వద్ద కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం మోదుగుంట్ల గ్రామానికి చెందిన నోముల ప్రకాశ్, నోముల ముత్యగిరి అన్నదమ్ములు. ఇద్దరూ టైల్స్ వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో సులభంగా డబ్బు సంపాదించాలని అనుకున్నారు. ఈ విషయాన్ని వారికి తెలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన కొమర రత్తయ్యకు చెప్పారు. ప్రకాశ్, ముత్యగిరి, రత్తయ్యతో పాటు పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన రత్తయ్య స్నేహితులు బత్తుల రేణు, దేరంగుల కృష్ణవేణి కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు నకిలీ బంగారం బిస్కెట్లు అమ్మాలని నిర్ణయచుకుని రత్తయ్య, రేణు కలిసి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కంచరోళ్ల దగ్గర నకిలీ బంగారం బిస్కెట్లను తయారు చేయించారు. వాటిని సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకట్‌రెడ్డికి అమ్మాలని నిర్ణయించుకున్నారు. తమ చుట్టాలు పురాతన ఇళ్లు కూలగొడుతుండగా రెండు బంగారం బిస్కెట్లు దొరికాయని వాటిని తక్కువ రేటుకు ఇస్తామని వెంకట్‌రెడ్డిని నమ్మించారు. మఠంపల్లి మండలం సాగర్ సిమెంట్స్ మైన్స్ వద్దకు డబ్బులు తీసుకుని రావాలని వెంకట్‌రెడ్డికి సూచించారు. ఈ నెల 2వ తేదీన రూ.7లక్షలు తీసుకుని వెంకట్‌రెడ్డి వెళ్లగా, డబ్బులు తీసుకున్న ముఠా సభ్యులు బంగారం బిస్కెట్లు ఇవ్వకుండానే అక్కడ నుంచి పరారయ్యారు. వెంకట్‌రెడ్డి మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా సదరు ముఠా సభ్యులు చిలుకూరు మండలం జెర్రిపోతులగూడేనికి మాతంగి శ్రీనుకు కూడా తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మొదట రూ.10వేలు తీసుకున్నారు. తాను మోసపోయినట్లు శ్రీను గ్రహించి హుజూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముఠా సభ్యులను పట్టుకోవడానికి పక్కా స్కెచ్ వేశారు. మిగిలిన డబ్బులు ఇస్తానని శ్రీనుతో ముఠాసభ్యులకు పోలీసులు ఫోన్ చేయించారు. ఇది నమ్మిన ముత్యగిరి, రత్తయ్య హుజూర్‌నగర్‌లోని భారత్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే సీఐ చరమందరాజు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది వారిని పట్టుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మిగిలిన ముఠా సభ్యులను కోదాడలో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితుల నుండి రూ.7లక్షల నగదు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక ఆటో, 9 సెల్‌ఫోన్లు, 3 నకిలీ బంగారం బిస్కెట్లు, నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నరాఉ. నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్‌ఐలను డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ చరమందరాజు, ఎస్‌ఐలు ముత్తయ్య, నరేష్, అజయ్, ఏఎస్‌ఐలు బలరాంరెడ్డి, రమేష్ ఐడీ పార్టీ సిబ్బంది నాగరాజు, శంభయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి


రత్తునాయక్ (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గేదె అడ్డురావడంతో దానిని ఢీకొని రేషన్ డీలర్ మృతిచెందాడు. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాచ్యాతండా రేషన్ డీలర్ వాంకుడోతు రత్తునాయక్(78) గురువారం సాయంత్రం పని నిమిత్తం చౌటుప్పల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. గుడిమల్కాపురం గ్రామ శివారులో గేదె అడ్డు వచ్చింది. దీంతో అతడు గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రత్తునాయక్‌కు తీవ్ర గాయలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన వేమవరపు సాయి, మేదరి శైలజ బట్టలు ఉతికే క్రమంలో బుధవారం నిడమనూరు మండలం బొక్కమంతలపాడు వద్ద సాగర్ ఎడమ కాల్వలో గల్లంతయ్యారు. నిడమనూరు ఎస్‌ఐ గోపాల్‌రావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు సమీపంలో బ్రిడ్జి వద్ద కాల్వలో కొట్టుకుపోతున్న మేదరి శైలజ మృతదేహాన్ని పోలీసులు గుర్తించి స్థానికుల సహాయంతో ఒడ్డుకు తీసుకొచ్చారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయి మృతదేహం ఇంకా దొరక్కపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

- ఆరుగురికి గాయాలు

చిట్యాల: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులోకి రాగానే ఆ సమీపంలో ఉన్న దసమి ఫార్మా పరిశ్రమలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు దిగేందుకు బస్సును డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపివేశాడు. అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా లారీ వచ్చి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న చిట్యాలకు చెందిన చంద్రగిరి శివసాయి కాలు విరగగా.. మరో ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రంగస్థల కళాకారుడు రామయ్య మృతి


రామయ్య (ఫైల్)

మునగాల: మండలంలోని రేపాల గ్రామానికి చెందిన గ్రామ వెలుగు నాట్యమండలి సభ్యుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు మాచర్ల రామయ్య(85) అనారోగ్యంతో గురువారం తన నివాసంలో మృతిచెందారు. రామయ్య గతంలో రేపాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. గ్రామ వెలుగు నాట్యమండలి ద్వారా ఆయన పలు నాటకాల్లో నటించడమే కాకుండా బుర్రకథ కళాకారుడిగా పేరుపొందారు. ఆయన గత ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. రామయ్య అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. రామయ్యకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రామయ్య మృతి పట్ల గ్రామ వెలుగు నాట్యమండలి సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


ఆందోళన చేస్తున్న సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

రామగిరి(నల్లగొండ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పున్న సోమనాథ్ అన్నారు. ఈ మేరకు గురువారం నల్లగొండ పట్టణంలోని డైట్ కళాశాల నందు పెన్షనర్స్ ఆక్రోష్ మార్చ్ పేరిట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పున్న సోమనాథ్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వలన రిటైర్డ్ అయిన వారికి కనీస పెన్షన్ నెలకు రూ.2000 నుంచి రూ.3000 కూడా రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరమళ్ల శ్రీనివాస్, బొమ్ము కృష్ణయ్య, తండు భానుప్రకాష్, శివచ, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, రాజశేఖర్, మల్లికార్జున్, మమత, కల్పన, శిల్ప, ధనుంజమ్మ, యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి ఆలయ ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మృతి


రామలింగరాజు (ఫైల్)

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి. రామలింగరాజు అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. బుధవారం ఉదయం 11గంటలకు విధులు ముగించుకుని ఆయన హైదరాబాద్‌లోని తన తన నివాసానికి వెళ్లారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు అతడి కుటుంబ సభ్యులు, ఎస్పీఎఫ్ అధికారులు, ఆలయ సిబ్బంది వెల్లడించారు. రామలింగరాజు మృతి పట్ల ఆలయాధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

త్రిపురారం: భూతగాదాల కారణంగా పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. త్రిపురారం ఎస్‌ఐ వై. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల పరిధిలోని అల్వాలపాడు గ్రామానికి చెందిన ధనావత్ వెంకటేశ్వర్లు, ధనావత్ బాలు బంధువులు. వీరిద్దరి మధ్య గత పదిహేను సంవత్సరాలుగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఇదే విషయమై ఇటీవల ధనావత్ బాలు తన కుటుంబ సభ్యులతో కలిసి ధనావత్ వెంకటేశ్వర్లును దుర్భాషలాడాడు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు ఈ నెల 24వ తేదీన తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన వెంకటేశ్వర్లు భార్య కింద పడి ఉన్న వెంకటేశ్వర్లును గమనించి కుటుంబ సభ్యుల సహాయంతో మిర్యాలగూడ పట్టణంలోలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య ధనావత్ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

రసాయనాల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి


పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

నడిగూడెం: వ్యవసాయంలో రసాయన మందుల వాడకం గణనీయంగా పెరుగుతోంది. తెగుళ్లను నివారించేందుకు రైతులు ఎక్కువ సంఖ్యలో రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. పిచికారీ సమయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారని నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దేవ ప్రసాద్ అంటున్నారు. రసాయన మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

- రసాయన మందలు పిచికారీ చేసే ముందు తప్పనిసరిగా ముక్కు, కళ్లకు హెల్మెట్ లాంటిది తప్పనిసరిగా ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకునే సమయంలో చేతులకు తప్పనిసరిగా గ్లౌజులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్లు తాగడం, బీడీ, సిగరెట్ వంటివి తాగొద్దు
- పిచికారీ అనంతరం పరిశుభ్రంగా స్నానం చేసిన తర్వాతే ఆహార పదార్థాలు తినాలి.
- రసాయన మందును గాలి వీచే వ్యతిరేక దిశలో పంటపై పిచికారీ చేయరాదు.
- సాధ్యమైనంతవరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే పిచికారీ చేయడం మంచిది.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.
- రసాయనిక మందుల ప్రభావం ఊపిరితిత్తుల నుంచి నేరుగా మెదడుకు వెళ్తుంది.
- రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి పురుగు మందులు పిచికారీ చేయడం ఉత్తమం.
- పిచికారీ చేసే సమయంలో చిన్నపిల్లలు సమీపంలో లేకుండా చూసుకోవాలి.
- రసాయన మందు పిచికారీ చేసిన తర్వాత ఆ డబ్బాలను అనేకసార్లు కడిగిన తర్వాతే ఇళ్లలో నీటి నిల్వకు వాడుకోవాలి.

సమాజానికి అవసరమయ్యే వార్తలు రాయాలి



మీడియా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

- నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర
- జర్నలిస్టులకు నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌లో పాల్గొన్న పలువురు ప్రముఖులు

నల్లగొండ: జర్నలిస్టులు సంచలన వార్తలకి ప్రాధాన్యం ఇవ్వకుండా సమాజానికి అవసరమయ్యే వార్తలకు సముచిత స్థానం కల్పిస్తే సమాజంలో మార్పు తీసుకురావొచ్చని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జర్నలిస్టులకు నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మీడియా తన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తే సమాజంలో మంచి మార్పును చూడవచ్చని అన్నారు. జర్నలిస్టులు నిజ నిర్ధారణ చేసుకుని వార్తలు రాస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిరోజు సుమారు రూ.5కోట్ల నుంచి రూ.6కోట్ల వరకు సైబర్ నేరగాళ్లు సామాన్యుల నుంచి కొల్లగొడుతున్నారని అన్నారు. సైబర్ క్రైం బాధితులు ఎక్కువగా ఉన్నత విద్యావంతులే ఉంటున్నారని, ప్రతి జిల్లాలో సైబర్ క్రైంకి సంబంధించి సైబర్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ డా.మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు, మీడియాకు చేరవేయడంలో పీఐబీ ముఖ్యపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు నైతిక విలువలు పాటిస్తూ, కచ్చితమైన వార్తలను సేకరించి ప్రజలకు మరిన్ని మంచి వార్తలు అందేలా చూడాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ పని విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. మరో వక్త సీడాక్ సైంటిస్ట్ జగదీప్‌బాబు మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో మనం డేటాను సురక్షితంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వరరావు, పీఐబీ అధికారులు గాయత్రి, శివచరణ్‌రెడ్డి, సీబీసీ సిబ్బంది, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

2029లో బీసీలదే అధికారం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మర్రిగూడ: 2029లో రాష్ట్రంలో బీసీలదే అధికారమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని అనేక పోరాటాలు నిర్వహించామని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ కులగణన చేపట్టి బీసీలకు మరిన్ని రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రధాని బీసీ అయినప్పటికీ దేశంలో ఎక్కడా బీసీలకు న్యాయం చేయలేని పరిస్థితిలో ఉండడం బాధాకరమన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదిగితే తమ హక్కులు పొందవచ్చన్నారు. ఐలమ్మ, అంబేద్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పగిళ్ల సత్యనారాయణ, నక్క శ్రీను, ఎలిమినేటి సత్తిరెడ్డి, ఐతగోని ఆంజనేయులు, సిరిపంగి శ్రీను, బాలపూరి కిరణ్, కందుల ప్రభాకర్, జాజుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములపై దృష్టి సారించాలి

- దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన


మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన

రామగిరి(నల్లగొండ): దేవాదాయ శాఖ భూముల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో ఎండోమెంట్ ఆఫీసర్లు, మేనేజర్లతో ఆమె సమీక్ష ససమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ, జనగామ జిల్లాల్లో దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేసి హద్దు రాళ్ల ఏర్పాటు చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయ భూములకు బహిరంగ వేలం నిర్వహించి కౌలుకు ఇవ్వాలన్నారు. హైకోర్టు, లోకాయుక్త, ఎండోమెంట్స్ ట్రిబ్యునల్, రెవెన్యూ కోర్టులలో గల భూ కేసులపై త్వరగతిన కౌంటర్స్ ఫైల్ చేయాలన్నారు. ఆలయాలను సందర్శించే భక్తులకు సౌకర్యాలు, ఆర్జిత సేవలు, ప్రసాదాలలో నాణ్యత పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి నల్ల గొండ జిల్లా, జనగామ జిల్లాలోని పరిశీలకులు, ఈఓలు, మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక మాయం


తిరుమలగిరిలో అధికారులు సీజ్ చేసిన ఇసుక (ఫైల్)


సీజ్ చేసిన ఇసుకను తరలించిన దృశ్యం

తిరుమలగిరి (తుంగతుర్తి): అధికారులు సీజ్ చేసిన ఇసుకను కొందరు అక్రమార్కులు మాయం చేశారు. గతంలో తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం సమీపంలో బిక్కేరు వాగులో చెక్ డ్యాం నిర్మించడానికి స్టేపై కంపెనీ వాళ్లు పెద్దఎత్తున ఇసుకను డంప్ చేశారు. డంప్ చేసిన ఇసుకను కంపెనీ వారు అక్రమంగా లారీల్లో తరలిస్తుంటే 2022 మే 14న కౌన్సిలర్లు మొగుళ్ల జితేందర్, సీహెచ్. హన్మంతు, ఆంగోతు భాస్కర్ అడ్డుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి తహసీల్దార్ సంతోష్‌కిరణ్ ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. కొత్త ప్రభుత్వం రావడం, చెక్ డ్యాం పనులు పూర్తి కావడంతో కంపెనీ వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీజ్ చేసిన ఇసుకకు, ఇతర పనిముట్లకు కాపలాగా ఒక వాచ్‌మెన్‌ను నియమించారు. కొద్దిరోజులుగా సీజ్ చేసిన ఇసుక డంప్‌ను జేసీబీ, టిప్పర్ల సహాయంతో అక్రమంగా తరలిస్తున్నారని, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని 10వ వార్డు కౌన్సిలర్ మొగుళ్ల జితేందర్ గురువారం డిమాండ్ చేశారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి


మృతిచెందిన బాలుడు

భూదాన్‌పోచంపల్లి: నీటి సంపులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం పోచంపల్లి పట్టణంలోని రాంనగర్ కాలనీలో జరిగింది. బిహార్ రాష్ట్రం పూర్నియా జిల్లా బర్హరాకోఠి గ్రామానికి చెందిన అర్జున్‌దాస్ జీవనోపాధి నిమిత్తం ఏడాది క్రితం కుటుంబంతో కలిసి పోచంపల్లికి వలస వచ్చి రాంనగర్‌లో అద్దె ఉంటున్నాడు. స్థానికంగా మేస్త్రీ వద్ద లేబర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. గురువారం ఉదయం అర్జున్‌దాస్ పనికి వెళ్లగా భార్య గుడియాదేవి ఇంటి వద్ద ఉంది. సాయంత్రం గుడియాదేవి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో వారి చిన్న కుమారుడు కరణ్‌కుమార్(13 నెలలు) తన అన్నతో కలిసి ఆరుబయట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో నీటి సంపులో పడిపోయాడు. వీరి రూం పక్కనే అద్దెకు ఉంటున్న మరో వ్యక్తి సంతోష్‌దాస్ బయట నుంచి ఇంటికి రాగా, తన తమ్ముడు కరణ్‌కుమార్ నీటి సంపులో పడిపోయాడని అతడి అన్న సంతోష్‌దాస్‌కు చెప్పాడు. దీంతో సంపులో నుంచి కరణ్‌కుమార్‌ను బయటికి తీసి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.